క్లుప్తంగా

సీఎస్ డీటీగా వెంకటరెడ్డి

పెద్దతిప్పసముద్రం: మండల సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్‌గా వెంకటరెడ్డి నియమితులైనట్లు తహసీల్దార్ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈయన గతంలో కలకడ మండలంలో పని చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ సీఎస్ డీటీగా పని చేస్తున్న రెడ్డెప్ప మదనపల్లికి బదిలీ అయ్యారు.

నూతన నియామకం


రియాసత్ అలీఖాన్

పెద్దతిప్పసముద్రం: మండలానికి చెందిన మాజీ సర్పంచ్ డి.రియాసత్ అలీఖాన్‌కు వైఎస్సార్‌సీపీ మైనార్టీ రాష్ట్ర విభాగంలో చోటు దక్కింది. వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా రియాసత్ అలీఖాన్‌ను నియమిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. మైనార్టీల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక చొరవ చూపుతానన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్రగాయాలు

తంబళ్లపల్లె: ద్విచక్ర వాహనంలో వారపు సంతకు వెళ్తున్న దంపతులకు అడవి పందులు అడ్డురావడంతో అదుపుతప్పి పడి తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. ఎద్దులవారిపల్లె పంచాయితీ కుమ్మరపల్లెకు చెందిన రైతు వెంకటరమణ, భార్య పద్మావతమ్మ ఆకుకూరలు అమ్మేందుకు తంబళ్లపల్లెకు ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. మార్గమధ్యంలోని ఎర్రసానిపల్లె వద్ద అడవిపందులు అడ్డురావడంతో పడిపోయి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న 108 సిబ్బంది మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు.

పాఠశాలల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి

బి.కొత్తకోట: మండలంలోని ప్రైవేట్ పాఠశాలల్లోని ప్రతి తరగతి గదిలో సీసీ కెమెరాలను తప్పక ఏర్పాటు చేసుకోవాలని ఎంఈవో రెడ్డి శేఖర్ యాజమాన్యాలకు సూచించారు. శనివారం స్థానిక ఎమ్మార్సీలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యంతో సమవేశం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యాహక్కు చట్టం కింద ప్రతి పాఠశాలలో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించాలని, వీటిని ఉచితంగా ఇవ్వాల్సి ఉంటుందని కోరారు. యూడైస్ పూర్తి చేయాలని, నిబంధనలను పాటించాలన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత


మద్యం ప్యాకెట్లు చూపుతున్న ఎస్ఈబీ అధికారులు

పెద్దతిప్పసముద్రం/ములకలచెరువు: పెద్దతిప్పసముద్రం మండలంలోని కమ్మచెరువు పంచాయతీ మారుగానిపల్లి చెక్‌పోస్టు వద్ద ములకలచెరువు ఎస్ఈబీ సీఐ రాంమోహన్ సిబ్బందితో కలసి శనివారం నాకాబందీ నిర్వహించారు. ఈ నేపథ్యంలో సత్యసాయి జిల్లా తనకల్లు మండలం రత్నేనాయక్ తండాకు చెందిన సురేష్ నాయక్ (30) ద్విచక్ర వాహనం తనిఖీ చేయగా కర్ణాటక రాష్ట్రంకు చెందిన 960 మద్యం ప్యాకెట్లు లభించినట్లు సీఐ పేర్కొన్నారు. పట్టుబడిన వాహనాన్ని, మద్యంతో సహా సీజ్‌చేసి నిందితుడిపై కేసు నమోదు చేశామని తెలిపారు. అనంతరం రిమాండ్‌కు పంపినట్లు సీఐ వెల్లడించారు.

జాతీయ సెమినార్‌కు ఆహ్వానం


రహమాన్

మదనపల్లె సిటీ: ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లక్నో రీజినల్ సెంటర్ ఫర్ అర్బన్ ఎన్విరాన్‌మెంట్ స్టడీస్ సెంటర్‌లో నిర్వహించే జాతీయ సెమినార్‌కు మదనపల్లె మున్సిపాలిటీ సుభాష్‌రోడ్డు వార్డు సచివాలయ సెక్రటరీ ఎస్ఆర్ రహమాన్‌కు ఆహ్వానం అందింది. లక్నోలోని ఎన్విరాన్‌మెంట్ స్టడీస్‌లో ఈనెల 27,28 తేదీల్లో జరిగే అర్బన్ -20 ఇండియా, అభివృద్ధి చెందుతున్న భావి సవాళ్లు, మార్గం అనే అంశాలపై ఐసీఎస్ఎస్ఆర్, విద్యా మంత్రిత్వ శాఖ సంయుక్తంగా ఈ సెమినార్ నిర్వహించనున్నారు. తను ఆహ్వానం అందడంపై సంతోషంగా ఉందన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

పెద్దతిప్పసముద్రం: వేసవికి ముందే మండలంలో తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు చేపట్టామని ఎంపీడీఓ బ్రహ్మానందరెడ్డి శనివారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో నీటి ఎద్దడి నెలకొన్న గ్రామాల్లో ప్రజలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసారన్నారు. అలాంటి గ్రామాల్లోని ప్రభుత్వ బోర్లలో నీటి సామర్థ్యం, స్థితిగతులు, ప్రత్యామ్నాయ చర్యలపై పంచాయతీల్లో పర్యటించి ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, కార్యదర్శులతో సమగ్రమైన సమాచారం సేకరిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపుతూ నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న గ్రామాల్లో కొత్త బోర్లు డ్రిల్లింగ్ చేయించేందుకు ముందస్తుగా బోర్ల మంజూరుకు ప్రతిపాదనలు కూడా పంపినట్లు తెలిపారు.

ఎన్నికల విధులు బాధ్యతగా నిర్వర్తించాలి


మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఫర్మాన్‌అహ్మద్‌ఖాన్


గుర్రంకొండ జెడ్పీహైస్కూల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న జేసీ

జాయింట్ కలెక్టర్ ఫర్మాన్‌అహ్మద్‌ఖాన్

పీలేరు : ఎన్నికల విధులను సెక్టోరియల్, పోలీస్ సెక్టోరియల్ అధికారులు బాధ్యతగా నిర్వర్తించాలని జాయింట్ ఫర్మాన్‌అహ్మద్‌ఖాన్ అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో తహసీల్దార్లు, సెక్టోరియల్ అధికారులు, పోలీస్ సెక్టోరియల్ అధికారులకు ఎన్నికల విధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరుగనున్న ఎన్నికలకు ఎన్నికల కమీషన్ సూచనలు, నిబంధనల మేరకు అధికారులు సమాయత్తం కావాలన్నారు. ఎప్పటికప్పుడు వచ్చే మార్గదర్శకాలకు అనుగుణంగా పని చేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల పరిశీలన మొదలుకొని పోలింగ్ ప్రక్రియ ముగిసి ఈవీఎంలను స్ట్రాంగ్ రూములలో భద్రపరిచే వరకు సెక్టోరియల్ అధికారులు కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. నార్మల్, క్రిటికల్, వల్నరబిలిటి పోలింగ్ కేంద్రాలను గుర్తింపు, వాటి మ్యాపింగ్ పోలీస్ సెకోటరియల్ అధికారులతో కలసి సదరు గ్రామాలను సందర్శించాలన్నారు. నియోజకవర్గంలో మొత్తం 281 పోలింగ్ కేంద్రాలు ఉండగా 93 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంప్, ఫర్నీచర్, వీల్‌ఛైర్స్, విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, అప్రోచ్ రోడ్లు, వెబ్ క్యాస్టింగ్ చేయుటకు, విద్యుత్, ఇంటర్‌నెట్ సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్ట్రాంగ్ రూములను పరిశీలించి అధికారులకు తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రాయచోటి డీఎస్పీ మహబూబ్‌బాషా, ఈఆర్‌వో రమా, తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి

గుర్రంకొండ: పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అవసరమైన అన్ని వసతులు కల్పించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్‌అహ్మద్‌ఖాన్ అన్నారు. శనివారం స్థానిక తెలుగు జెడ్పీహైస్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో తప్పనిసరిగా విద్యుత్ సౌకర్యం ఉండేలా ముందుగా చూసుకోవాలన్నారు. వికలాంగులు సులభంగా పోలింగ్ కేంద్రంలోకి వెళ్లడానికి అనువైన ర్యాంప్‌లను వెంటనే సిద్ధం చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాలు ఉండే పాఠశాలల్లో చుట్టూరా ప్రహరీ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ఆయా పంచాయతీ కార్యదర్శులు చొరవ చూపాలన్నారు. గుర్రంకొండ తెలుగు జెడ్పీహైస్కూల్లో అత్యధికంగా ఎనిమిది పోలింగ్ కేంద్రాలు ఉన్నందును నిర్మాణంలో ఉన్న ప్రహరీ పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. అధికారులు నిత్యం పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తూ ఏర్పాట్లను పర్యవేక్షించాలన్నారు. ఆయన వెంట ఎంఈవో సురేంద్రబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లాల్‌స్వామి, ఏవో నాగశివారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఘనంగా పల్లకీ ఉత్సవం


పల్లకీలో వెంకటరమణుడు

తంబళ్లపల్లె: మండలంలోని కోసువారిపల్లెలో వెలసిన శ్రీప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలను టీటీడీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహిస్తున్నారు. శనివారం పల్లకీ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉపప్రధాన అర్చకులు కృష్ణప్రసాద్‌బట్టార్, అర్చకులు రమేష్‌బాబులు శ్రీదేవి,భూదేవి సమేత స్వామివారిని పల్లకీలో అలంకరించి పూజలు, అభిషేకాలు చేసి ఊరేగించారు. రాత్రి స్వామిని హంస వాహనంపై అలంకరించి భక్తులకు దర్శనం, తీర్థప్రసాదాలు అందజేశారు. టీటీడీ ధర్మప్రచారపరిషత్ ఆధ్వర్యంలో హరికథ, బజన కార్యక్రమాలు భక్తులను అలరింప చేశాయి. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ డిశంత్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రూ. 30 లక్షలతో సీసీ రోడ్లు


శ్రీరామనగర్‌లో నిర్మించిన సీసీ రోడ్డు

పీలేరు రూరల్ : మండలంలోని బోడుమల్లువారిపల్లె పంచాయతీ పరిధిలో రూ. 30 లక్షలతో సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్లు పంచాయతీరాజ్ డీఈ భాస్కర్, సర్పంచ్ బి.సి. జయలక్ష్మీదేవి తెలిపారు. శనివారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన వినతుల మేరకు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సహకారంతో పీలేరు పట్టణంలోని స్థానిక కడప రోడ్డు మార్గం శ్రీరామనగర్‌లో రూ. 15 లక్షలతో 220 మీటర్లు, తిరుపతి రోడ్డు మార్గంలో మణికంఠ నగర్‌లో రూ. 15 లక్షలతో 220 మీటర్లు సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బి.సి. అమరనాథరెడ్డి, జ్ఞానశేఖర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి హరిప్రసాద్ పాల్గొన్నారు.

యువత సామాజిక బాధ్యతతో మెలగాలి


మాట్లాడుతున్న డాక్టర్.ఆర్.గురుప్రసాద్

మదనపల్లె : దేశ నిర్మాణంలో యువత పాత్ర కీలకమని, వారు సామాజిక బాధ్యతతో మెలిగినప్పుడే ఆశించిన ఫలితాలను సాధించవచ్చని జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్ అన్నారు. శనివారం కళాశాలలోని ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో యువసంవాద్ 2047 కార్యక్రమాన్ని నిర్వహించారు. భారతదేశ అభివృద్ధిలో యువత పాత్ర అనే అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా యూత్ ఫర్ యూనిటీ అండ్ వలంటరీ యాక్షన్ (యువ) అనేది లాభాపేక్ష లేకుండా అట్టడుగు వర్గాలకు చెందిన వారికి సాధికారత కల్పించేందుకు, హక్కులు పొందేందుకు నిర్దేశించిన కార్యక్రమం అన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ సందర్భంగా 2లక్షలకు పైగా దేశవ్యాప్తంగా నిర్వహించిన కార్యక్రమాలు దేశభక్తిని రగిల్చాయన్నారు. భారతీయులుగా మన సంప్రదాయాల గురించి గర్వపడాలని, అభివృద్ధి చెందిన భారతదేశ లక్ష్యం పంచప్రాణ్‌ని చేపట్టాలని ప్రధాని నరేంద్రమోదీ పిలుపునిచ్చారన్నారు. విదేశీయుల బానిసత్వంలో మనలో నాటుకున్న మనస్తత్వాన్ని తొలగించడం చాలా అవసరమన్నారు. అప్పుడే 2047 నాటికి భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందని, ప్రపంచం గర్వపడేలా రూపొందుతుందని తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపాల్ మల్లికార్జునరావు, ప్రిన్సిపాల్ రమాదేవి, హెడ్‌కానిస్టేబుల్ రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సిద్ధం సభకు తరలిరావాలి


నాయకులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

తంబళ్లపల్లె: అనంతపురం జిల్లా రాప్తాడులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన ఆదివారం నిర్వహించే సిద్ధం మహాసభకు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలిరావాలని పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఎమ్మెల్యే స్వగృహంలో నాయకులతో చర్చా సమావేశం జరిగింది. తంబళ్లపల్లె నియోజకవర్గం నుండి ప్రతి పల్లె నుండి సభకు వచ్చే వారికి నాయకులు ఏర్పాట్లు చేసి స్వాగతించాలని సూచించారు. సమావేశంలో మండల పార్టీ కన్వీనర్ చౌడేశ్వర్, నాయకులు నరేంద్రరెడ్డి, మైనుద్దీన్, ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌తో లబ్ధిదారులకు ఊరట


బాధితులకు చెక్‌లను అందజేస్తున్న ఆకేపాటి

రాజంపేట రూరల్: అనారోగ్యంతో వైద్య సేవలు అందించుకున్న లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ ఊరట నిస్తుందని జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమరనాథరెడ్డి అభిప్రాయపడ్డారు. మండల పరిదిలోని ఆకేపాటి ఎస్టేట్‌లో శనివారం రూ.10 లక్షల 79వేల చెక్కులను బాధితులకు పంపిణీ కార్యక్రమం ఆకేపాటి చేపట్టారు. వీరబల్లి మండలంలోని వంగిమళ్ల గ్రామానికి చెందిన రెడ్డప్పకు రూ.5 లక్షలు, రాజంపేట మండలంలోని హస్తవరం పంచాయతీలోని చెంచుగారిపల్లికి చెందిన వెంకటసుబ్బరాజుకు ఒక లక్ష 40 వేల రూపాయలు, వీరబల్లి మండలంలోని వీరబల్లికి చెందిన కృష్ణమూర్తికి ఒక లక్ష 20వేల రూపాయలు, సుండుపల్లి మండలంలోని కురవపల్లి గ్రామానికి చెందిన రమేష్‌కు రూ.90వేలు అందజేశారు. నందలూరు మండలంలోని నందలూరుకు చెందిన ఓబిలి జయలక్ష్మికి రూ.85వేలు, వీరబల్లి మండలంలోని ఎదపల్లి గ్రామానికి చెందిన ధర్మారెడ్డికి రూ.70వేలు, వీరబల్లి మండలం యర్రంరాజుపల్లి గ్రామానికి చెందిన హరితకు రూ.30వేలు, సిద్ధవటం మండలంలోని వెలుగుపల్లి జంగాలపల్లికి చెందిన శాంతికి రూ.28వేలు, వీరబల్లి మండలంలో మట్లి గ్రామానికి చెందిన సుబ్బన్నకు రూ.16 వేల విలువ చెక్కులను అందజేశారు.

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత మెటీరియల్

కలికిరి: డీఎస్సీ అభ్యర్థులకు ఉచితంగా మెటీరియల్ అందజేయనున్నట్లు గ్రంధాలయ అధికారి విజయ్ కుమార్ తెలిపారు. చిత్తూరులోని కుట్టి డీఎస్సీ కోచింగ్ కేంద్రం నిర్వాహకులు సేవా దృక్పథంతో 50 మందికి ఉచితంగా మెటీరియల్ పంపిణీ చేస్తారని, ఆసక్తి కలిగిన అభ్యర్థులు టెట్, డీఎస్సీ దరఖాస్తులు, రెండు ఫోటోలతో స్థానిక గ్రంధాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బస్సులను వేళకు నడపాలి

మదనపల్లె సిటీ: డ్రైవర్లు, కండక్టర్లు బస్సులను సమయపాలన ప్రకారం నడపాలని ఆర్టీసీ-2 డిపో ఇన్‌చార్జ్ డీఎం మూరె వెంకటరమణారెడ్డి అన్నారు. శనివారం స్థానిక టు డిపో కార్యాలయంలో సిబ్బందితో గేట్ మీటింగ్ నిర్వహించారు. డీఎం మాట్లాడుతూ మద్యం సేవించి విధులకు హాజరుకాకూడదన్నారు. కెఎంపిఎల్, ఈపీకె పెంచాలన్నారు. సైకాలజిస్టు సుధాకర్‌రెడ్డి పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో సీఐ గీత, సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణావతారంలో లక్ష్మీజనార్దనస్వామి

రామసముద్రం: మండల కేంద్రంలో వెలసిన లక్ష్మీ జనార్ధనస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం జనార్ధనస్వామి శ్రీకృష్ణావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు ఘనంగా నిర్వహించారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని భక్తి శ్రద్ధలతో పూజించి మొక్కులు చెల్లించుకున్నారు. హాజరైన భక్తులకు ఆలయ అర్చకులు పార్థసారధి బట్టర్, కులశేఖర్‌బట్టర్‌లు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం స్వామివారికి ఊంజల్‌సేవ నిర్వహించి, రాత్రి ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

హమాలీల కూలిరేట్లు పెంచాలి

రాయచోటి అర్బన్: పెరిగిన ధరలకు అనుగుణంగా హమాలీలకు కూలిరేట్లను పెంచాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ కోరారు. శనివారం ఆయన సివిల్‌సప్లయ్స్ హమాలీలతో కలసి జిల్లా పౌరసరఫరాల మేనేజర్ మూర్తికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సివిల్ సప్లయ్స్ గోడౌన్‌లలో లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తున్న హమాలీలకు ఆదివారం రోజును సెలవు దినంగా ప్రకటించాలన్నారు. జిల్లాలోని 12 సివిల్ సప్లయ్స్ గోడౌన్‌లలో హమాలీలకు మంచినీటి సౌకర్యం కల్పించాలన్నారు. ప్రతి నెలా మొదటి వారంలోనే జీతాలు చెల్లించాలన్నారు. హమాలీలను నాలుగవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్స్ హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య, నేతలు సలీంబాషా, రాంప్రసాద్, వెంకటనరసింహులు, సంపత్‌కుమార్, చిన్నప్ప, ఆంజనేయులు, శంకర, శ్రీనివాసులు దేవ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యోగుల ర్యాలీ

రాయచోటి అర్బన్: తమ సమస్యలను పరిష్కరించాలంటూ శనివారం ఉద్యోగ, ఉపాధ్యాయుల జేఏసీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌జీఓ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్ యాదవ్, జేఏసీ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, కన్వీనర్ వెంకటేశ్వరరెడ్డి, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు చెంగల్‌రెడ్డిలు మాట్లాడుతూ ప్రభుత్వం గత నాలుగేళ్లుగా ఉద్యోగులకు ఇవ్వాల్సిన ఐఆర్ 30 శాతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం కార్యదర్శి ఈశ్వరయ్య, ఎన్‌జీఓలు పాల్గొన్నారు.

లోక అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

రాయచోటి టౌన్ : మార్చి నెల 9వ తేదీ నిర్వహించే లోక్ అదాలత్‌ను కక్షిదారులు, పోలీసులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా 5వ అదనపు న్యాయమూర్తి కృష్ణన్ కుట్టి సూచించారు. శనివారం తన చాంబర్‌లో పోలీసులు, న్యాయవాదులతో వేర్వేరుగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు ఈ లోక్ అదాలత్ ద్వారా పరిష్కారమయ్యే కేసులు సుప్రీం కోర్టు తీర్పుతో సమానమని తెలిపారు. రోడ్డు ప్రమాద కేసులు, క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు కూడా పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి ప్రసూన, ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి ఫాతిమా, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి డాక్టర్ శారద, న్యాయవాదులు, అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి, ట్రాఫిక్ సీఐ మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

పదిలో వంద శాతం ఫలితాలు సాధించాలి


మాట్లాడుతున్న రెగ్యులేటరీ కమిషన్ సభ్యులు ఈశ్వరయ్య

కురబలకోట: రాష్ట్రంలో జరగనున్న పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని రాష్ట్ర స్కూల్ ఎడ్యుకేషన్ రెగ్యులేటరీ కమిషన్ అండ్ మానిటరింగ్ కమిటీ, రాష్ట్ర విద్యా సంస్కరణల కమిటీ సభ్యులు బి. ఈశ్వరయ్య సూచించారు. అన్నమయ్య జిల్లా కురబలకోట జడ్పీ హైస్కూల్ పదివ తరగతి విద్యార్థులకు ఎంపీపీ బి.దస్తగిరి ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇప్పటి నుండి శ్రద్ధగా చదివినా సులభంగా ఉత్తీర్ణులు కావచ్చన్నారు. తల్లిదండ్రులు కూడా విద్యార్థుల పట్ల తగిన శ్రద్ధ వహించాలన్నారు. పరీక్షలకు సన్నద్ధం కావడానికి ఇంటిలో తగిన వాతావరణం కల్పించాలన్నారు. సీఎం జగన్ ప్రభుత్వం ఏడాదికి ప్రతి విద్యార్థిపై రూ.90 వేలు ఖర్చు పెడుతోందన్నారు. సదుపాయాలు, సౌకర్యాలు కల్పిస్తున్నప్పుడు విద్యార్థులు కూడా చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎంపీపీ బి. దస్తగిరి మాట్లాడుతూ చదువు విలువ తెలుసుకుని ముందుకు సాగాలన్నారు. చదువు ఉన్నత స్థాయికి తీసుకెళుతుందన్నారు. మండల ప్రత్యేక ఆహ్వానితులు బైసాని చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రణాళిక బద్ధంగా చదివితే మంచి మార్కులు సాధించవచ్చన్నారు. విద్యార్థులకు లక్ష్యాత్మక బోధన అలవాటు చేసినట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

సిద్ధం కార్యక్రమాన్ని విజయవంతం చేయండి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చింతల

వాల్మీకిపురం: అనంతపురం జిల్లా రాప్తాడులో ఆదివారం నిర్వహించే సిద్ధం సభను విజయవంతం చేయాలని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ ఆదివారం జరిగే సిద్ధం సభకు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. పీలేరు నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జమీర్‌అలీ ఖాన్, గుడిబండ రవి, షావత్, వెంకటసిద్దులు, మోహన్‌రాజ్, కమలాకర్‌రెడ్డి, రామచంద్ర, శ్రీనివాసులు రెడ్డి, రవికుమార్, ఆనంద రెడ్డి, నీళ్లభాస్కర్, కేశవ రెడ్డి, సురేష్ రెడ్డి, శంకర్ రెడ్డి, ఆనంద, మునిభాస్కర్, రాజగోపాల్ రెడ్డి, చలపతి పాల్గొన్నారు.

'తప్పుడు రాతలు మానుకోవాలి'


మాట్లాడుతున్న మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ తిమ్మారెడ్డి

కలికిరి: పచ్చ మీడియా తప్పుడు రాతలు మానుకోకుంటే ప్రజలే తగిన బుద్ధిచెబుతారని మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి అన్నారు. శనివారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఉన్నది లేనట్లు, లేనిది ఉన్నట్లు రాసి అధికారులు, ప్రజలను మభ్యపెట్టడం పచ్చమీడియాకు పరిపాటిగా మారిందని ఆయన విమర్శించారు. కలికిరి మండలం పత్తేగడ గ్రామానికి చెందిన శివయోగి మల్లికార్జున ఆ గ్రామంలో లేనట్లు, అయినా ఆయన ఓటు అలాగే ఉన్నట్లు ఓ పచ్చ పత్రికలో ప్రచురించారన్నారు. అయితే శివయోగి మల్లికార్జున గ్రామంలోనే ఉన్నట్లు ఆధారాలున్నా ప్రచరించడం దారుణమన్నారు. మీడియా విలువలకు తిలోదకాలిచ్చి దిగజారడం తగదని హెచ్చరించారు. అధికారులు గ్రామంలోకి వచ్చి విచారించగా అతను గ్రామంలోనే ఉన్నట్లు ఆధారాలు లభ్యమయ్యాయన్నారు. ఇటువంటి కథనాలపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటాని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లికార్జున, రామిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

బాహుదానదిలో పురాతన విగ్రహం



కలికిరి: మండల పరిధిలోని మేడికుర్తి వద్ద గల బాహుదానదిలో శనివారం పురాతన మహా విష్ణువు విగ్రహం బయటపడినట్లు స్థానికులు అధికారులకు సమాచారమిచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న రెవెన్యూ, గ్రామ పంచాయతీ అధికారులు విగ్రహాన్ని గుర్తించి దేవదాయశాఖ ఈవో మంజుల దృష్టికి తీసుకెళ్లారు. విగ్రహానికి పాదాలు, ముక్కు విరిగిపోయి ఉండటంతో విగ్రహం ఎవరైనా నిమజ్జనం చేసి ఉంటారని, తిరిగి నీటిలో నిమజ్జనం చేయాలని చెప్పడంతో అధికారులు తిరిగి నీటిలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ హుస్సేన్ పీరా, వీఆర్‌ఓ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి మయూరి పాల్గొన్నారు.

జిడ్డు కృష్ణమూర్తి వర్ధంతి


జిడ్డు కృష్ణమూర్తి చిత్రపటం వద్ద నివాళులు

వాల్మీకిపురం: భారతీయ తత్వవేత్త జిడ్డు కృష్ణమూర్తి వర్ధంతిని జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిడ్డు కృష్ణమూర్తి చిత్తూరు జిల్లా మదనపల్లిలోని జిడ్డు నారాయణమ్మ, సంజీవమ్మ దంపతులకు మే 12, 1895లో జన్మించారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కల్పన, ఉపాధ్యాయులు, రామలక్ష్మమ్మ, ధనలక్ష్మమ్మ, లక్ష్మిదేవి, ఉమాదేవి, గౌతమి, రేఖ, ప్రియాంక, శోభన, బేబిప్రసన్న పాల్గొన్నారు.